# 8

# క్రీస్తు: మన దైనందిన జీవిత మార్గదర్శి

యేసు క్రీస్తు మనలను రక్షించుటకు ఈ లోకమునకు వచ్చాడు. ఒకసారి రక్షింపబడిన తరువాత, మనమెలా జీవించాలి? ఈ విషయం మనకు తెలియకుండునట్లు యేసు దానిని మరుగున దాచిపెట్టలేదు. ఆయన మన రక్షకుడు మాత్రమే కాదు, కానీ మన దైనందిన జీవిత మార్గదర్శియై యున్నాడు. మనము ఈ లోకములో సమృద్ధియైన జీవితము జీవించి అటుతరువాత ఆయనతో కూడ పరలోకములో నిరంతరము జీవించగలుగునట్లు ఆయన మనలను ముందుకు నడిపిస్తాడు, నిర్దేశిస్తాడు, మరియు మనకు మార్గనిర్దేశనమునిస్తాడు.

యేసు మనలను ఎలా నడిపిస్తాడు? ఆయన మనలను పరిశుద్ధ బైబిలు, దేవుని వాక్యము ద్వారా నడిపిస్తాడనునది ఇందుకు సంక్షిప్తమైన సమాధానమై యున్నది. మనము యేసు క్రీస్తును, ఆయన జీవితము, మరియు ఆయన ఉపదేశముల గూర్చి కచ్చితంగా తెలిసికొనుటకు ఒకే ఒక మార్గమేమనగా పరిశుద్ధ బైబిలు – ప్రత్యేకంగా, క్రొత్త నిబంధన గ్రంథము, నేటి ప్రజల కొరకైన క్రీస్తు నిబంధన గ్రంథము. ఇంకా, మనము మరి ఎక్కువ నిర్దిష్ఠముగా చెప్పుకోవాలనుకొంటే, “క్రొత్త నిబంధన ద్వారా ఆయన మనలనెలా నడిపిస్తాడు?” అని చెప్పుకొనవచ్చును.

*మొదటిదిగా, యేసు తన ఉపదేశముల ద్వారా మనలను నడిపిస్తాడు.* యేసు “దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడు” (యోహాను 3:2; యోహాను 13:13, 14 చూడుము). ఆయన “రబ్బీ” యని పిలువబడుట (యోహాను 1:38, 49; 6:25; “రబ్బూనీ,” యోహాను 20:16) ఆయన ఒక ఉపదేశకుడై యుండెనని సూచించుచున్నది. శిష్యులు ఆయన ఉపదేశములను అనుసరించవలసినవారై యుండిరి. ఆయన తన అపొస్తలులకు మహా ఆదేశమును ఇచ్చినప్పుడు, ఆయన ఇలా పలికాడు,

> … పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొన వలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను (మత్తయి 28:18–20).

రాబోవు యుగములలో ఆయన శిష్యులగుటకు కోరువారందరికి ఆయన తన శిష్యులకు ఉపదేశించిన విషయాలన్నీ కూడ బోధింపబడవలెనని యేసు ఆజ్ఞాపించాడు. ఇట్టి పర్యవసానంలో, సమస్త క్రైస్తవులు యేసు బోధించిన ఉపదేశములను నేర్చుకొని వాటి ప్రకారంగా జీవించవలసి యున్నది (ఉదాహరణకు అపొస్తలుల కార్యములు 20:35 చూడుము). కొందరి దృక్పథమునకు విరుద్ధంగా,[1] యేసు ఆదేశములు నేడు మనము కూడా అమలుపర్చుటకు అనువైనవై యున్నవి.

*రెండవదిగా, ఆయన చేసిన కార్యముల ద్వారా యేసు మనలను నడిపిస్తాడు.*

యేసు మనకు నమూనాయై యున్నాడు, మనకు మాదిరియై యున్నాడు. పేతురు ఇలా వ్రాస్తున్నాడు, "ఇందుకు మీరు పిలువబడితిరి, క్రీస్తు కూడా మీ కొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను" (1 పేతురు 2:21). యేసు నడవడిక యాదృచ్ఛికమైనది కాదు సరికదా అది ఉద్దేశమేమీలేనిది కూడా కాదు; మనము ఎలా జీవించాలో అర్థంచేసికొనుటకు మనకు సహాయపడునట్లు ఆయన జీవించివలసిన విధానంలో జీవించాడు. ఆయన జీవితమంతా దేవుని ప్రజలు ఎలా జీవించవలసియున్నదో ప్రదర్శించుటకు ఉద్దేశింపబడిన ఒక ఉపన్యాసమై యున్నది.

*మూడవదిగా, ఆయన శిష్యులు చెప్పిన ఉపదేశముల ద్వారా యేసు మనలను నడిపిస్తాడు.* యేసు తన శిష్యులకిచ్చిన మహా ఆదేశము ఆయన వారికి బోధించిన సంగతులను వారు ఇతరులకు ఉపదేశించవలెనను ఒక గొప్ప కార్యభారమును వారిపై మోపియున్నారు. ఆయన ఆరోహణము తరువాత, అపొస్తలులు సువార్త ప్రకటించుచు సంచరించినప్పుడు, వారు క్రీస్తు, సమస్త అధికారము కలిగియున్నవాడు, ఇచ్చిన అధికారముతో వారికప్పగింపబడిన పనులను చేసారు. అంతకు మునుపు, ఆయన వారితో ఈ విధంగా మాటలాడాడు,

> ... వారు మిమ్మును అప్పగించునప్పుడు, ఏలాగు మాటలాడుదుము లేక ఏమి చెప్పుదుము అని చింతింపకుడి; మీరేమి చెప్పవలెనో అది ఆ గడియలోనే మీకనుగ్రహింపబడును, మీ తండ్రి ఆత్మ మీలో ఉండి మాటలాడుచున్నాడే, గాని మాటలాడువారు మీరు కారు (మత్తయి 10:19, 20).

ఇంతేగాక, ఆయన తన అపొస్తలుల మీదికి సహాయకున్ని ("ఆదరణకర్తను"; KJV), పరిశుద్ధాత్మను, పంపుననియు; ఆయన వచ్చి వారిని "సర్వ సత్యము లోనికి" నడిపించుననియు యేసు సెలవిచ్చాడు (యోహాను 16:7, 13), పెంతెకొస్తు దినాన అపొస్తలుల మీదికి పరిశుద్ధాత్మ దిగి వచ్చినప్పుడు, "ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించిన కొలది" వారు అన్యభాషలతో మాటలాడసాగిరి (అపొస్తలుల కార్యములు 2:4; KJV). వారు ఆనాడు ఏమి మాటలాడిరో – మరియు ఆనాటి నుండి కూడా, వారు సువార్తను ప్రకటించుచుండినప్పుడు – వారు పరిశుద్ధాత్మ ప్రేరేపణ చేతనే మాటలాడారు.

కాబట్టి, వారు ఉపదేశించినదంతయును, క్రీస్తు అధికారముతో ఉపదేశించారు. వారి మాటలు క్రీస్తు తానే ఉచ్చరించిన మాటలు వలె సాధికారమైనవై యున్నవి. అపొస్తలుల సందేశము ఎలా ఎంచబడవలసి యుండెనో పౌలు థెస్సలొనీకయ సంఘమునకు తన పత్రికను రచించుచుండినప్పుడు ఉదాహరణంగా వర్ణించాడు:

> ఆ హేతువుచేతను, మీరు దేవుని గూర్చిన వర్తమాన వాక్యము మా వలన అంగీకరించినప్పుడు, మనుష్యుల వాక్యమని యెంచక, అది నిజముగా ఉన్నట్టు దేవుని వాక్యమని దానిని అంగీకరించితిరి, గనుక మేమును మానక దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. ఆ వాక్యమే విశ్వాసులైన మీలో కార్యసిద్ధి కలుగజేయుచున్నది (1 థెస్సలొనీకయులకు 2:13).

అపొస్తలులు ప్రబోధించిన మరియు ఉపదేశించిన సంగతులు, యేసు క్రీస్తు తానే మాట లాడిన మాటల వలె, దేవుని వాక్యమై యుండినది.

కొన్ని పరిశుద్ధ సత్యవేద గ్రంథములలో మిగతా వాక్యభాగము నుండి ప్రత్యేకంగా

గుర్తించగలుగు నిమిత్తము, యేసు మాటలు ఎక్కువ ప్రాముఖ్యమైనవి లేదా బైబిలులోని మిగతా భాగము కంటె ఎక్కువగా ప్రేరేపింపబడినవై యున్నవన్నట్లుగా, యేసు మాటలు ఎరుపు రంగులో ముద్రింపబడి యుండును. ఎరుపు రంగులో ముద్రింపబడుటనుబట్టి అది సహాయకరముగా ఉన్నప్పటికిని, అపొస్తులుల మరియు క్రొత్త నిబంధన ఇతర రచయితల ఉపదేశములు యేసు సొంత మాటలు వలెనే, "ఎరుపు రంగులో ఉన్న మాటల" వలెనే, సాధికారము గలవియు, ప్రేరేపింపబడినవియునై యున్నవి.

కాబట్టి, యేసు మనలను ఆయన ఉపదేశముల ద్వారా, ఆయన చేసిన కార్యముల ద్వారా, మరియు ప్రేరేపింపబడిన అపొస్తులులు మరియు సువార్తికులు చేసిన ప్రసంగముల ద్వారా, క్రొత్త నిబంధనలో మనకు బయలుపర్చబడినట్లుగా నడిపిస్తాడు. అనగా, ఇంతకు మునుపు తెలియజెప్పబడినట్లుగా, యేసు మనలను పరిశుద్ధ బైబిలు ద్వారా, ప్రత్యేకించి క్రొత్త నిబంధన ద్వారా, నడిపిస్తాడని మరో మాటలో చెప్పుకొనవచ్చును.

యేసు మనలను ఎక్కడికి నడిపిస్తాడు? అనగా, యేసు తన మాటలు మరియు జీవితము ద్వారా, మనము ఏమి చేయగలుగునట్లుగా నడిపిస్తాడు? దీనిని క్లుప్తంగా చెప్పుకొనవలెనంటే, మనము దేవునిని మరియు సాటి మానవుని ప్రేమించుటకు యేసు మనలను నడిపిస్తాడని చెప్పుకొనవచ్చును. "ఆజ్ఞలన్నిటిలో ప్రధానమైనదేది?" అని యేసును ప్రశ్నించినప్పుడు (మార్కు 12:28), ఆయన,

> "ప్రధానమైనది ఏదనగా – ఓ ఇశ్రాయేలూ, వినుము; మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు. నీవు నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణవివేకముతోను, నీ పూర్ణబలముతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునది ప్రధానమైన ఆజ్ఞ. రెండవది, నీవు నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెననునది రెండవ ఆజ్ఞ; వీటికంటె ముఖ్యమైన ఆజ్ఞ మరేదియు లేదని అతనితో చెప్పెను" (మార్కు 12:29-31).

ఆయన జీవితంలో మరియు ఆయన ఉపదేశములలో, యేసు దేవునిని మరియు మన పొరుగువారిని ప్రేమించుట అనగా ఏమిటో చక్కని దృష్టాంతముతో వివరించాడు.

## మనము దేవుని ప్రేమించునట్లు ఆయన మనలను నడిపిస్తాడు

యేసు పలికిన మాటలు మరియు చేసిన క్రియలు దేవుని ప్రేమించుట అనగా ఏమిటో చక్కగా ప్రదర్శించును. మనము ఆయనకు లోబడుచు ఆయనను అనుకరించవలసి యున్నది. అయితే దీనిని మనమెలా చేయగలము?

### శోధనకు "వద్దు"అని చెప్పవలెను.

దేవుడు పరిశుద్ధుడు గనుక తన ప్రజలు కూడ పరిశుద్ధులై యుండవలెనని ఆయన ఎల్లప్పుడు ఆశించుచున్నాడు (లేవీయకాండము 11:45; 1 పేతురు 1:15). యేసు అపవాది చేత శోధింపబడినప్పుడు ఆ శోధనలను ఎదిరించుట ద్వారా పరిశుద్ధ జీవితమును నిదర్శనాత్మకంగా ప్రదర్శించాడు (మత్తయి 4). ఆయన సమస్త విషయములలో మన వలెనే శోధింపబడినను, ఆయన పాపము చేయలేదు (హెబ్రీయులకు 4:15). ఆయనను వెంబడించువారు పవిత్రులై యుండవలెనని ఆయన ఉపదేశించాడు (మత్తయి 5:8, 27-30). 'నేను యేసు ప్రభువు శిష్యుడనని' స్వాధికారంతో చెప్పుకొంటూనే

యింకను బాహాటంగా పాపములో జీవించుచుండువాడు, అవినీతి చర్యలలో అసభ్యంగా నిమగ్నమై యుంటూ, యేసు నడిపింపు ప్రకారం నడుచుకొనుటలేదు.

**దేవుని ఇంటిని గూర్చిన ఆందోళన కలిగియుండుము.**

యేసు దేవుని ఇంటి విషయంలో కలిగియుండిన ఆందోళన, ఉత్సాహంతో కూడిన ఆకాంక్ష ఆయన "రూకలు మార్చువారిని" మరియు వ్యాపారస్తులను దేవాలయములో నుండి వెళ్లగొట్టునట్లు చేసినది (యోహాను 2:16, 17). ఈనాడు దేవుని ఇల్లు మన ప్రభువు యొక్క సంఘమై యున్నది (1 తిమోతి 3:15). సంఘము తన సొంతమని చెప్పుచు దానిని దేవుని కుమారునిగా ఆయన యందలి విశ్వాసమను పునాదిపై నిర్మించునని వాగ్దానము చేయుట ద్వారా యేసు సంఘము యెడల కలిగియుండిన ఆయన ప్రేమను కనుపర్చాడు (మత్తయి 16:16–19). యేసు దేవుని ఇంటి విషయము, యేసు నిర్మించిన సంఘము పట్ల కలిగియుండిన ప్రేమను పంచుకొనకుండానే ఈనాడు ఒకడు తాను దేవునిని యథార్థంగా ప్రేమించుచున్నాడని స్వాధికారంతో చెప్పజాలడు.

**ఆయన చిత్తమును నెరవేర్చుము.**

దేవుని చిత్త ప్రకారము చేయుట ఆయన ప్రజల యొక్క అత్యంత ప్రధానమైన ఆశయమై యున్నది. దేవుని ప్రణాళికను నెరవేర్చుట యేసు జీవితంలో ప్రాథమిక ఉద్దేశమై యుండినది. "నేను నా సొంత ఇష్టమును కాదు, కానీ నన్ను పంపిన వాని చిత్తమునే వెదుకుదును" అని ఆయన సెలవిచ్చాడు (యోహాను 5:30బి; 4:34; 6:38 చూడుము). ఆయన జీవితము అంతమగుచుండిన సమయంలో, దేవుని చిత్త ప్రకారము చేయుట అనగా ఏమిటో యేసు ఉదాహరణంగా ప్రదర్శించాడు; "నా యిష్టప్రకారము కాదు, కానీ, నీ చిత్తమే సిద్ధించునుగాక" అని ప్రార్థించుట ద్వారా ఆయన అణకువతో కూడిన తన నమ్రతను అభివ్యక్తము చేసాడు (లూకా 22:42; KJV). "మరణము పొందునంతగా విధేయత చూపినవాడై" అని పౌలు చెప్పుచున్నట్లు ఆయన అణకువగలవాడై యుండెను (ఫిలిప్పీయులకులకు 2:8; హెబ్రీయులకు 5:7, 8 చూడుము).

దేవుని ప్రేమించుట అనంటే ఆయనకు లోబడుటయను అర్థమును మాత్రమే యేసు ప్రదర్శించలేదు, కానీ విధేయత యొక్క అవసరతను కూడా ఆయన ఉపదేశించాడు. "ప్రభువా, ప్రభువా," అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు, గాని "పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును" అని ఆయన చెప్పాడు (మత్తయి 7:21). దేవుని ప్రేమించుటలో ఆయన చిత్తమునకు విధేయతతో లోబడియుండుట కూడ కలిసియున్నదని యేసు మనకు ఆచరణాత్మకంగా అగుపర్చాడు. దేవునికి లోబడు విషయాన్ని గంభీరముగా ఎంచనివాడు యథార్థముగా దేవుని ప్రేమించడు మరియు వాడు యేసు అడుగుజాడల్లో నడుచుకొనుటలేదు.

**మతపరంగా న్యాయసమ్మతమైన కర్తవ్యములను వెరవేర్చుము.**

క్రీస్తు తన తోటి వారి గూర్చి చాలా తాపత్రయముగలవాడై యుండెను (సహజంగానే, ఆయన అలాంటివాడై యుండెను) కానీ మోషే నియమించిన ధర్మశాస్త్రమును పాటించుటను

ఆయన బొత్తిగా పట్టించుకొనలేదని (ఇది నిజము కాదు) కొన్నిసార్లు బోధింపబడుచున్నది. క్రీస్తు మోషే నియమించిన ధర్మశాస్త్రమును గౌరవించాడు; ఆయన దాని క్రింద జీవించాడు మరియు అందుండిన కర్తవ్యములను పాటించాడు, మరియు ఈ వాస్తవమునకు అవసరమైన నిదర్శనమును క్రొత్త నిబంధన సమకూర్చుచున్నది.

మొదటిదిగా, క్రీస్తు ధర్మశాస్త్రమును పాటించాడని క్రొత్త నిబంధన తెలియజేయుచున్నది. క్రీస్తు "ధర్మశాస్త్రము క్రింద పుట్టెను" అని పౌలు చెప్పుచున్నాడు (గలతీయులకు 4:4, 5). సబ్బాతు దినాన సమాజమందిరమునకు వెళ్లుటకు యేసు ఒక అలవాటుగా చేసికొన్నాడని సువార్తలు నివేదించుచున్నవి (లూకా 4:16). యేసు యూదులు పండుగలను పాటించుటకు యెరూషలేమునకు వెళ్లుచు, ఆయన యూదులు పండుగల దినములను సహితము పాటించాడు. దీనికి తోడుగా, ఇతర యూదుల వలెనే, ఆయన కూడ వార్షిక ఆలయ పన్ను అరషెకెలును చెల్లించాడు (మత్తయి 17:24–27). యేసు ఏ పాపమును లేకుండా జీవించాడు (హెబ్రీయులకు 4:15). ఆయన, ఒక మానవుడుగా, దేవుని నియమముల క్రింద జీవించుచు, వాటిని పాటించకుండా తప్పిపోయినట్లయితే, ఇటువంటి ప్రకటనలు జారీచేయబడెడివి కావు.

రెండవదిగా, యేసునకు విరోధముగా ఆయన శత్రువుల చేత చేయబడిన నేరారోపణలు యేసు ఏ విధముగానైనను ధర్మశాస్త్రము విషయములో తప్పిపోయాడని రుజువుపర్చవు. ఆయన శిష్యులు పంటచేలలోబడి వెళ్లుచు, వెన్నులు త్రుంచుచుండినందున, వారు సబ్బాతు దినమును ఆచరించుటలేదని యేసు శత్రువులు వారిని నిందించారు (మార్కు 2:23–28 చూడుము). ఏదిఏమైనా, యేసు శిష్యులు మోషే నియమించిన ధర్మశాస్త్రమును తప్పిపోలేదు; వారి చర్యలు కేవలము రబ్బీలు సాంప్రదాయములను ఉల్లంఘించినవి. మరొక సందర్భంలో, ఆయన శిష్యులు చేతులు కడుగుకొనకుండానే భోజనము చేయుటకు యేసు వారిని అనుమతించాడని కొందరు పరిసయ్యులును శాస్త్రులను ఆయనను విమర్శించారు. ఈసారి కూడా నింద అదే, శిష్యులు "పెద్దల పారంపర్యాచారమును" అతిక్రమించారు (మత్తయి 15:2). ఆయనను విమర్శించుచుండినవారు వారి సాంప్రదాయములను పాటించుట ద్వారా, "దేవుని ఆజ్ఞను అతిక్రమించుచుండిరి" గనుక వారు "వ్యర్థముగా" ఆరాధించుచున్నారని చెప్పుచు యేసు తన ప్రతిస్పందనను ఆవేదించాడు (మత్తయి 15:3, 9). ఈ ఉదాహరణముల ఆధారంగా చూచినట్లయితే, యేసు ధర్మశాస్త్రమునకు లోబడలేదను ఒకడు ఒక తుది అభిప్రాయమునకు రాలేదు. ఆయన దేవుని నియమముల యెడల అతి మిక్కిలి గౌరవము కలిగియుండెను, కానీ మానవ కల్పితమైనవై "అమలు చేయవలసినదే" యని పెద్దలు ఆదేశించిన సాంప్రదాయములను పట్టించుకొనలేదు.

మూడవదిగా, యేసు శాస్త్రులతోను పరిసయ్యులతోను చెప్పిన మాటలు ఇతరులు దేవుని నియమములకు లోబడనవసరం లేదని వారిని మినహాయించలేదు. యేసు ఇలా చెప్పుచున్నాడు,

> అయ్యో, వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీకు శ్రమ, మీరు పుదీనాలోను సోపులోను జీలకర్రలోను పదియవ వంతు చెల్లించి, ధర్మశాస్త్రములో ప్రధానమైన విషయములను, అనగా న్యాయమును కనికరమును విశ్వాసమును విడిచిపెట్టితిరి; వాటిని మానక వీటిని చేయవలసి యుండెను (మత్తయి 23:23).

యేసు కేవలము "న్యాయము మరియు కనికరము మరియు విశ్వసనీయత" గూర్చి మాత్రమే ఆసక్తి కలిగియుండెను కానీ ఆయన దశమ భాగము ఇచ్చుట గూర్చిన నియమములను పాటించాల్సిన అవసరతను ఏమాత్రమును పట్టించుకొనలేదని ఈ వచనంను చదివిన తరువాత తరుచుగా అందరు అభిప్రాయపడుతుంటారు. కొన్ని విషయాలు ఇతర విషయాలు కంటే ఎక్కువ ప్రాముఖ్యమైనవి, లేదా "అత్యంత ప్రబలముగా ప్రాధాన్యమైనవి" అని ఈ వాక్యభాగము ప్రబోధించుచున్నను, "తక్కువ ప్రబలముగా ప్రాధాన్యమైనవి" అప్రధానమైనవని యేసు చెప్పలేదు. "వాటిని (పుదీనాలోను సోపులోను జీలకర్రలోను 'పదియవ వంతు' చెల్లించుట) మానక వీటిని (ప్రబలముగా ప్రాధాన్యమైనవాటిని) చేయవలసి యుండెను" అని ఆయన సెలవిచ్చాడు. యూదులు ధర్మశాస్త్రములోని అత్యల్పమైన విషయాలను పాటించుటలో తప్పేమీ లేదు; వాస్తవానికి అలా పాటించుటను యేసు ఆమోదించాడు! శాస్త్రులును పరిసయ్యులను ధర్మశాస్త్ర సంస్కార విధులను నిక్కచ్చిగా అంటిపెట్టుకొని యుండుటపైనే దృష్టిని కేంద్రీకరించుచుండినను దానిలోని ముఖ్యమైన అభ్యాసములను అశ్రద్ధచేయుచుండిన విషయం గూర్చి వారు సరిదిద్దుకొనవలసిన వైఖరియై యుండినది.

ఈ వాస్తవములన్నిటిని ఇంత వివరంగా పరిశీలించిన తరువాత మన తుది అభిప్రాయమేమై యుండాలి? యేసు దేవుని ధర్మశాస్త్రము క్రింద జీవించుచునే ఆయన ఎల్లప్పుడు దానిని పాటించాడు. కాబట్టి, మనము ఏ నియమము క్రింద జీవించుచున్నామో దానికి లోబడుట ముఖ్యమైన విషయమై యున్నది. మతసంబంధమైన మన కర్తవ్యములను పాటించుట ప్రాముఖ్యముకాదని దేవునిని యథార్థముగా ప్రేమించువాడెవడును స్వాధికారంతో చెప్పడు. యేసు యొక్క మాటలు మరియు చేతల ఆధారంగా, దేవునిని ప్రేమించవలెనంటే మనము పరిశుద్ధముగా జీవించుటకు ప్రయాసపడవలసి యుండునని చెప్పగలము; దేవుని ఇంటికి, సంఘమునకు అంకిత భావముతో సమర్పించుకొన్నవారమై యుండవలెను: దేవునికి లోబడుటయే మన జీవిత ప్రాథమిక లక్ష్యమై యుండవలెను; మరియు ఇప్పుడు అమలు చేయబడుచున్న దేవుని నియమములో గల మతసంబంధమైన విషయములను పాటించవలెను.

### మనము ఇతరులను ప్రేమించునట్లు ఆయన మనలను నడిపిస్తాడు

ఆయన జీవితము మరియు ఉపదేశముల ద్వారా, మనము మనకు వలెనే మన పొరుగువారిని ప్రేమించునట్లు కూడ యేసు మనలను నడిపిస్తాడు. ఇటువంటి ప్రేమ కలిగియుండుటకును కనుపర్చుటకును అవసరమైనదేమిటి?

**వారికి ఉపచారము చేయుము.**

యేసు ఉపచారము చేయుచుండిన జీవితమును జీవించాడు. దీనిని పేతురు "ఆయన మేలు చేయుచు సంచరించుచుండెను" అను, సారాంశము ద్వారా తెలియజేయుచున్నాడు (అపొస్తలుల కార్యములు 10:38). "మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు, గాని పరిచారము చేయుటకు వచ్చెను" అని యేసు చెప్పెను (మార్కు 10:45ఎ). ఆయన తన శిష్యుల పాదములు కడుగుట ద్వారా ఇట్టి పరిచర్యను ఆచరణాత్మకంగా చేసి చూపించి (యోహాను 13:1-12), ఇలా సెలవిచ్చాడు,

> బోధకుడనియు ప్రభువనియు మీరు నన్ను పిలుచుచున్నారు; నేను బోధకుడను ప్రభువును, గనుక మీరిట్లు పిలుచుట న్యాయమే. కాబట్టి, ప్రభువును బోధకుడైన నేను, మీ పాదములు కడిగిన యెడల, మీరును ఒకరి పాదములు ఒకరు కడుగవలసినదే. నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని (యోహాను 13:13-15).

ఈనాడు క్రైస్తవత్వమును చాటిచెప్పుచునే చాటుకు మాటుకు ప్రత్యేకతగల ప్రథమ స్థానములను మరియు ప్రముఖతను వెదకుచుండువారు, పరులకు ఉపచారం ఒనర్చుట పరమ విధియని తమ్మును తాము తగ్గించుకొనుటకు బదులుగా అది అసహ్యామైన ఆలోచనయని పరిగణించువారు, యేసు అడుగుజాడల్లో నడుచుకొనుటలేదు. ఇతరులను ప్రేమించవలసినట్లుగా వారు ప్రేమించుట లేదు.

**పక్షపాతము లేకుండా వారికి పరిచర్య చేయుము.**

దేవుడు ప్రతి ఒక్కరిని ప్రేమించుచున్నట్లుగానే, ఆయన పిల్లలైనవారు కులము, మతము, జాతి, రంగు, జాతీయత, మరియు సంస్కృతి వంటి పైపై విషయాలను పట్టించుకొనకుండా, అందరినీ ప్రేమింపబద్ధులై యున్నారు. యేసు ప్రతి ఒక్కరికి మేలు చేసాడు. ఆయన తన శిష్యులకు పరిచర్య చేసాడు, చిన్న పిల్లలను ఆశీర్వదించాడు (తద్వారా వారి తల్లిదండ్రులను సహితము ఆశీర్వదించాడు), మరియు కుష్ఠిరోగులను మరియు ఇతర అనారోగ్యస్తులను స్వస్థపర్చాడు. ఆకలితో అలమటించుచుండినవారికి ఆహారం పెట్టాడు, చనిపోయినవారిని మరలా బ్రతికించాడు, ప్రియులను కోల్పోయి దుఃఖములో ఉన్నవారిని ఓదార్చాడు, బీదలకు శుభవార్తను ప్రకటించాడు, మరియు ధనవంతులను ప్రేమించాడు. ఆయన తన సంస్కృతికి సంబంధించిన అభిలాషలకు వ్యతిరేకంగా వెళ్లుచు, ఆయన యూదేతరులను – సమరయులను మరియు ఇతరులను – ఆయన సమక్షము లోనికి ఆహ్వానించాడు మరియు పాపులకును సుంకపు గుత్తదారులకును స్నేహితుడయ్యాడు. ఆయన శిష్యులు కూడ అలాగే చేయాలని వారికి బోధించాడు: ఆయన చేసినట్లు, మేలు చేయుట (మత్తయి 7:12). ఆయన తిరిగి వచ్చినప్పుడు, మనము మన సాటి మానవులకు ఏదైనా ఉపచారము చేసామా లేదా అను దానినిబట్టి మనకు తీర్పు తీర్చబడును (మత్తయి 25:31-46). ఈనాడు వారు తమ ప్రేమను వారి సన్నిహిత స్నేహితులకు మరియు కుటుంబమునకు పరిమితం చేయువారు, వారి కంటె అల్పమైనవారుగా అగుపించువారిని చిన్న చూపు చూచును, ఆయనను వెంబడించువారు ప్రేమించవలెనని క్రీస్తు ఆశించుచున్న రీతిగా వారి సాటి మానవులను ప్రేమించుట లేదు.

**ఎవరికైనను ఎటువంటి హానినైనను కలుగజేయుకుము.**

ఆయన శిష్యులు ఇతరుల విషయంలో “పగతీర్చుకొనుట” అన్నట్టు ప్రవర్తిచుట, ప్రతీకారము చేయుటకు వెదుకుటను యేసు వారికి నిషేధించాడు (మత్తయి 5:38-42). వాస్తవమునకు, “మీ శత్రువులను ప్రేమించుడి మరియు మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి” అని యేసు ఉపదేశించాడు (మత్తయి 5:44; రోమీయులకు 12:19-21). యేసు చేసిన బోధల అర్థమేమైయుండినదో ఆయన జీవితము ప్రతిబింబించినది. ఆయనను మరణము నుండి తప్పించుటకు ఆయన పండ్రెండు సేనా

వ్యూహముల కంటె ఎక్కువ మంది దూతలు సేవలను ఉపయోగించుకొనగలిగి యుండెను (మత్తయి 26:53), కానీ ఆయన అలా చేయలేదు. సిలువ మీద ఉన్నప్పుడు, ఆయనను హింసించుచుండిన వారు క్షమింపబడవలెనని ఆయన వారి కొరకు ప్రార్థించాడు (లూకా 23:34). "ఆయన దూషింపబడియు, బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు, బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను" అని పేతురు చెప్పుచున్నాడు (1 పేతురు 2:23). ఒకడు ద్వేషింపబడినప్పుడు లేదా యాతన పెట్టబడినప్పుడు లేదా హింసంపబడినప్పుడు వాడు ప్రతిస్పందించు విధానము క్రైస్తవత్వమునకు అసలైన పరీక్షయై యున్నది.

యేసు మనలను ఎక్కడికి నడిపిస్తాడు? మనకు వలెనే మనము మన పొరుగువారిని ప్రేమించునట్లు, సాటి మానవులతో సరిగా వ్యవహరించునట్లు ఆయన మనలను నడిపిస్తాడు. మనము ఇతరులకు, వారెవరైనను, వారికెప్పుడైనను ఎటువంటిదైనను అపకారము చేయక లేక మన యెడల చేసిన తప్పిదములను ప్రతీకారమును వెదకక, ఉపచారము చేయుట ద్వారా, ఆయన చూపిన మాదిరిని అనుసరించినట్లయితే మనము ఇవన్నీ చేయగలము.

## ముగింపు

మన దైనందిన జీవితమునకు యేసు మన మార్గదర్శకుడై యున్నాడు. ఆయన మనతో చెప్పెడి సమస్తమును చేయుచు ఆయన చూపిన మాదిరిని అనుకరించుట ద్వారా మనము "ఆయన అడుగుజాడలలో" నడుచుకొనవలెను. మన దైనందిన జీవితంలో దీనంతటి ఆచరణాత్మక అంశం గూర్చి ఆలోచించినప్పుడు దీని అర్థమేమిటి? యేసు చెప్పిన ఉపదేశములను మరియు ఆయన చేపట్టిన చర్యలు ఈనాడు మనకు ఎలా వర్తిస్తాయో తెలిసికొనుట కొన్ని పర్యాయాలు కష్టముగా ఉంటుంది. ఎంతైనా, యేసు దేవుడై యున్నాడు, మనము కాదు. కాబట్టి, మనము అదే విధంగా ఆయన చేసిన సమస్తమును చేయలేము – చేయుటకు ప్రయత్నము చేయకూడదు.

ఉదాహరణకు యేసు ఇతరులకు తీర్పు తీర్చగలిగాడు ఏలయనగా ఆయన వారి హృదయాంతరాళమును ఆయన స్పష్టంగా ఎరిగియుండెను. ఇతరుల ఆలోచనలు మనకు తెలియవు, గనుక మనము వారి ప్రోత్సాహకములకు తీర్పు తీర్చలేము.

యేసు మోషే ధర్మశాస్త్రము క్రింద జీవించుచు అట్టి శాసనమును పరిపూర్ణంగా పాటించాడు. ఆయన చేయుచు ఉపదేశించిన కొన్ని విషయాలు ధర్మశాస్త్రమును పాటించుటకు సంబంధించినవై యుండినవి. అవి మనకు ప్రత్యక్షంగా వర్తించకపోయినను, ఆయన ఉపదేశించిన సూత్రముల నుండి మనము ఎల్లప్పుడు నేర్చుకొనవచ్చును.

యేసు చేసిన కొన్ని కార్యములలో ఈ రోజుల్లో విస్తృతంగా అభ్యసింపబడని వాడుకలున్నవి. అట్టి కార్యములకు సంబంధించినంత వరకు, ఆయన ఉపదేశములు మరియు అభ్యాసములు మనకు మన తరములోను సంస్కృతిలోను వర్తించు విధానాలను మనము నిశ్చయించుకొనవలెను.

"యేసు ఏమి చేయును?" అన్న ప్రశ్నకు సమాధానం ఏమిటో తెలిసికొనుటకు కొన్ని పర్యాయాలు కష్టమైనదిగా కనిపించినా, ఒక్కొక్క పరిస్థితికి తగిన సమాధానమును కనుగొనవలసిన సవాలును *యేసు అనుచరులు గంభీరంగా ఆలోచించవలెను. అటుతరువాత*

*మన దైనందిన జీవితమునకు మార్గనిర్దేశనము నిచ్చువాని నడిపింపును అనసరించుటకు మనము ప్రయత్నించవలెను.* మనము ఆయన అడుగుజాడల్లో నడుచుకొనుటకు మన శాయశక్తులా ప్రయాసపడినట్లయితే, మనము సమృద్ధియైన దీవెనలు పొందుకొను జీవితమును ఇప్పుడు అనుభవించుదుమనియు మనము క్రీస్తుతో కూడా నిరంతరము జీవించియుందుమనియు మనము ధైర్యముతో కూడిన నమ్మకమును కలిగియుండగలము.

---

సూచన

[1]యేసు సిలువ మీద మరణించునంత వరకు కూడ బోధలకు అడ్డు రాకుండునట్లు పాత నిబంధన తీసి వేయబడలేదు గనుక, యేసు జీవించి యుండినప్పుడు ఉపదేశించిన సంగతులు పాత నిబంధనకు సంబంధించినవై యున్నవి గనుక అవి క్రొత్త నిబంధన క్రింద జీవించుచున్నవారికి వర్తించవని కొందరు బోధించుచున్నారు. మత్తయి 28:18–20 ఈ సిద్ధాంతమును ఖండించుచున్నది. దీనికి తోడుగా, ఈ దృష్టికోణాన్ని అంగీకరించువారు క్రైస్తవులు వారి ప్రభువు, యేసు క్రీస్తు బోధలను అనుసరించనవసరములేదని వింతైన ప్రతిపాదనను రూఢిపర్చవలెను.